నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 24 డిసెంబర్ 2024 | RANGAREDDY




పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా నెక్లెస్‌రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, కుటుంబ సభ్యులు తదితరులు



సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

# బీఆర్ఎస్ పనులకు.. కాంగ్రెస్ ప్రారంభోత్సవాలు

బీఆర్ఎస్ పనులు..కాంగ్రెస్ గొప్పలు

- మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే..
- శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు నీళ్లివ్వడానికి గతంలో రూ.1200 కోట్లు మంజూరు
- మహేశ్వరం నియోజక వర్గానికి రూ.280 కోట్లు కేటాయింపు
- పైపులైన్లు, రిజర్వాయర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం కృషి
- పేదలకు ప్రతిరోజూ తాగునీటిని అందించాలని గత ప్రభుత్వం సంకల్పించింది
- మీర్‌పేట, బడంగ్‌పేటల్లోని రిజర్వాయర్లను పరిశీలించిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి



మీర్‌పేట.. నందిహిల్స్‌లోని మిషన్ భగీరథ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి



బడంగ్‌పేట.. విశాఖనగర్‌లో ఉన్న రిజర్వాయర్‌ను పరిశీలిస్తూ...

### కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఖర్చు చేయలే..

> రిజర్వాయర్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు. ప్రారంభించడానికి మాత్రం శిలాఫలకాలు, బోర్డులు మాత్రం ఏర్పాటు చేశారు. కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం గురించి తప్పుగా మాట్లాడే వారు రిజర్వాయర్లను మాత్రం ప్రారంభించడం విడ్డూరం. రిజర్వాయర్లు ప్రారంభించడమే కాదు, ప్రతిరోజూ నీళ్లు కూడా ఇవ్వాలి. పైపులైన్లు వేయని పాత కాలనీల్లో కొత్త లైన్లు వేయించాలి.
> – పి.సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వరం

బడంగ్‌పేట, డిసెంబర్ 23 : మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన రిజర్వాయర్లను సోమవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని కేసీఆర్ చాలెంజ్ చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం, నీళ్లు ఇచ్చామన్నారు. గ్రామాల్లో ప్రతిరోజూ మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని ఏ విధంగా ఇస్తున్నామో.. నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా అందించాలని కేసీఆర్ సంకల్పించారన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయాలని కేసీఆర్ ప్రణాళికను రూపొందించారన్నారు. పైపులైన్లు వేసేందుకు, రిజర్వాయర్లు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.1,200 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. మూడు దశల్లో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు గతంలోనే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేయించారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించడానికి రూ.280 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఆ నిధులతో పైపులైన్ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయని తెలిపారు. రిజర్వాయర్ల పనులు చివరి దశకు చేరగా.. కొన్ని చోట్ల పనులు పూర్తయినట్లు ఆమె వివరించారు. పాత కాలనీల్లో తప్ప, మిగతా అన్ని కాలనీల్లోనూ పైపులైన్ల పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉండగా.. ఆ సమయంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో గత ప్రభుత్వం వాటిని ప్రారంభించలేకపోయిందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తాము చేసినట్లు గొప్పలు చెప్పుకొంటూ ప్రారంభోత్సవాలు చేస్తున్నదని ఆమె ఆరోపించారు. రిజర్వాయర్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పైసా కూడా వెచ్చించలేదన్నారు.

### నీటి నిల్వకు రిజర్వాయర్ల నిర్మాణం

నీటిని నిల్వ చేసేందుకు రిజర్వాయర్లను నిర్మించినట్లు ఎమ్మెల్యే సబిత అన్నారు. 50 ఏండ్ల వరకు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గత ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో 19 రిజర్వాయర్లు నిర్మించినట్లు గుర్తు చేశారు. 29 ఎంఎల్‌డీ వాటర్ స్టోరేజీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల్లోనూ రిజర్వాయర్లను నిర్మించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ నీటి సమస్య లేదన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, డీఈ జ్యోతి, వినల్ గౌడ్, కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి, మర్రి నర్సిరెడ్డి, ఆనంద్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# వారివి గొంతెమ్మ కోర్కెలు కాదు..

- ఎన్నో ఏండ్లుగా విద్యాశాఖలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు.
- ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి వెంటనే నెరవేర్చాలి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు..

వికారాబాద్, డిసెంబర్ 23 : దీక్షలతో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల జీవితాలే కాదు.. లక్షకు పైగా విద్యార్థుల భవిష్యత్తు కూడా రోడ్డున పడుతుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష శిబిరం వద్దకు వెళ్లి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. రాజకీయ నాయకులు హామీలిచ్చే వారే కాని.. నెరవేర్చే వారు కాదు అన్న విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా విద్యాశాఖలో చాలీచాలని వేతనాలతో పని చేస్తూ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారివి గొంతెమ్మ కోర్కెలు కానే కావని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఉద్యోగులు 18 రోజులుగా దీక్షలు చేస్తున్నా సీఎం స్పందించపోవడం తగదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, పురుషోత్తంరెడ్డి, నాయకులు సత్యయ్యగౌడ్, గయాజ్, గఫార్, అశోక్, లక్ష్మణ్, శ్రీనివాస్, మల్లికార్జున్, మల్లేశ్, ఇస్మాయిల్, కాశయ్య, సుభాన్‌రెడ్డి, అనిల్, ప్రవీణ్‌కుమార్, కిశోర్, మహిపాల్, జైపాల్, శీను, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### బారికేడ్ల మధ్య నిరసన


ఆదిబట్ల : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారానికి 17వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అజీజ్, ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి తమ గురించి కనీసం ఒక్క మాట కూడా చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తమను క్రమబద్ధీకరించడంతోపాటు తక్షణమే పే స్కేల్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా సోమవారం ఉద్యోగులు నిరసన తెలుపుతున్న స్థలంలో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.




సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన తెలుపుతున్న స్థలంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

# కలకలం

- గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ముగ్గురు విద్యార్థుల అదృశ్యం
- వారం రోజుల వ్యవధిలోనే మిస్సింగ్
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- కేసు నమోదు చేసిన పోలీసులు







రంగారెడ్డి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ.. అక్కడే ఏర్పాటు చేసిన హాస్టళ్లలో ఉంటున్న ముగ్గురు విద్యార్థుల అదృశ్యం తీవ్ర కలకలం రేపుతున్నది. వారం రోజుల వ్యవధిలో వీరు మిస్సింగ్ కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో కళాశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన విష్ణు గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ.. అక్కడి హాస్టల్‌లోనే ఉంటున్నాడు. అతడు ఈ నెల 14న కళాశాల/హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. అలాగే, అదే కళాశాలలో చదువుతూ... అక్కడి హాస్టళ్లలోనే ఉంటున్న శివాని ఈనెల 17న, పావని ఈ నెల 20న మిస్సింగ్ అయ్యారు. విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

### జిల్లాలో 5,000 పైగా హాస్టళ్లు..

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు అత్యధికంగా ఉండడంతో సుమారు ఐదువేలకు పైగా ప్రైవేట్ హాస్టళ్లతోపాటు ఆయా కళాశాలల్లో వసతిగృహాలూ ఉన్నాయి. ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లోని ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీల్లో అధిక సంఖ్యలో ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం మంగల్‌పల్లి, ఇబ్రహీంపట్నం, శేరిగూడ, తుర్కయాంజాల్, బొంగుళూరు, మన్నెగూడ, ఆదిబట్ల పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హాస్టళ్లు ఏర్పాటయ్యాయి. అలాగే, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల సెగ్మెంట్లలోనూ ఇంజినీరింగ్ కళాశాలలు అత్యధికంగా ఉండగా.. హాస్టళ్లూ ఎక్కువగానే ఉన్నాయి. వాటిలో వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు నివాసముంటూ చదువుకుంటున్నారు. అయితే, వాటి నిర్వహణపై హాస్టళ్ల నిర్వాహకులు సరైన నిఘా ఉంచకపోవడంతో వారు ఎక్కడికి వెళ్తున్నారో.. ఎప్పుడొస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. మరోవైపు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. హాస్టళ్లపై నిర్వాహకులు నిఘా ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మండలంలోని నారెగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ, ఈదమ్మ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అమ్మవార్లకు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లెలోని అందరినీ సల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పర్మయ్య, తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు రఘునందన్‌రెడ్డి, నాగిరెడ్డి, మైపాల్‌రెడ్డి, అనంతయ్య, హన్మయ్య, శివరాజ్, శేఖర్‌రెడ్డి, గోపాల్, బాల్‌రాజ్, దేవకుమార్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

-నవాబుపేట, డిసెంబర్ 23

# నిధుల్లేక.. అభివృద్ధి కానరాక..

## సర్కారు నుంచి విడుదల కాని నిధులు

జిల్లాలో గ్రామ సీమల ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్లతోపాటు వివిధ పథకాల కింద గ్రామాలకు పుష్కలంగా నిధులు రావడంతో పలు అభివృద్ధి పనులను సర్పంచ్‌లు చేపట్టారు. అయితే.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చి.. ప్రభుత్వం మారి.. రేవంత్ సర్కార్ అధికారంలోకి రాగా.. గ్రామాల అభివృద్ధికి నిధులను విడుదల చేయడం లేదు. పంచాయతీల్లో నిధులున్నా విత్‌డ్రా చేయలేని దుస్థితి నెలకొన్నది. దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఎక్కడి చెత్త ఎక్కడే ఉంటున్నది. మురుగు రోడ్లపై పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

-రంగారెడ్డి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ)

- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- డీజిల్ కొనేందుకూ డబ్బుల్లేక మూలపడ్డ ట్రాక్టర్లు
- డ్రైవర్ల జీతాల చెల్లింపునకు కటకటే
- నిలిచిన పారిశుధ్యం, చెత్త తరలింపు, వీధిదీపాల మరమ్మతు తదితర పనులు
- గ్రామ సీమలపై దృష్టి సారించని ప్రభుత్వం
- అవస్థల్లో ప్రజలు
- బీఆర్ఎస్ హయాంలో ప్రగతి పథంలో ముందున్న పల్లెలు

రంగారెడ్డి జిల్లాలోని నెర్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం




జిల్లాలో 549 గ్రామ పంచాయతీలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి కింద నిధులు కేటాయించి గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, వైకుంఠధామాల నిర్మాణం, సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, చెత్త సేకరణ కు ప్రతి గ్రామపంచాయతీకీ ఒక్కో ట్రాక్టర్ చొప్పున కేటాయించారు. అయితే ప్రభుత్వం మారడంతో పంచాయతీలకు నిధుల విడుదల ఆగిపోవడంతో ప్రగతి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు కూడా డబ్బుల్లేని పరిస్థితి నెలకొన్నది. డీజిల్ కోసం పంచాయతీల నుంచి ఇచ్చిన చెక్కులకు సంబంధించిన డబ్బులు డ్రా కాకపోవడంతో పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు డీజిల్ పోయడం లేదు. దీంతో ట్రాక్టర్లు నిర్వహణ లేక మూలనపడ్డాయి. వాటి డ్రైవర్లకు జీతాలూ చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. అలాగే, పారిశుధ్యం, తాగునీరు బిల్లుల చెల్లింపు, వీధిదీపాల నిర్వహణకూ నిధుల్లేని దుస్థితి ఏర్పడింది. రేవంత్ ప్రభుత్వం నుంచి నిధులురాక.. పన్నులు వసూలు కాక తీవ్ర సంక్షోభంలో గ్రామపంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. కొంత కాలంగా గ్రామాల అభివృద్ధికి స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు రాకపోవడంతో వాటి నిర్వహణ భారంగా మారింది.



బీఆర్ఎస్ హయాంలో ఇంటింటి నుంచి చెత్తను ట్రాక్టర్‌లో సేకరిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

### ప్రత్యేక పాలనలో కొరవడిన ప్రగతి..

ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని నెలలుగా గ్రామపంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధికారులు గ్రామాలకు అప్పుడప్పుడు వచ్చిపోతున్నారు. సమస్యల పరిష్కారంతోపాటు నిధులు తీసుకురావడంలోనూ శ్రద్ధ చూపడంలేదనే ఆరోపణలున్నాయి. కేవలం పంచాయతీల్లో ఉన్న నిధుల నుంచి జీతభత్యాలు మాత్రమే ఇస్తున్నారు. ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక గ్రామాల్లోని ట్రాక్టర్లు చెడిపోయాయి. వాటిని మరమ్మతు చేయించేందుకూ నిధుల్లేని పరిస్థితి ఉన్నది. మరోవైపు గ్రామాల్లో మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నా పరిష్కరించేందుకు అవసరమైన నిధుల్లేని పరిస్థితి. రేవంత్ సర్కార్ స్పందించి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

### పంచాయతీల నిర్వహణకు నిధులు కేటాయించాలి



ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడిపోతున్నాయి. ప్రత్యేకాధికారులు చుట్టపుచూపులా వచ్చిపోతున్నారే తప్పా.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంలేదు. కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధిలో ముందు ఉన్నాయి. కానీ, రేవంత్ సర్కార్ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

-రవణమోని జంగయ్యముదిరాజ్

### గ్రామాలను అభివృద్ధి చేయాలి



పంచాయతీల్లో నిధులున్నా..వాటిని డ్రా చేసుకోని పరిస్థితి నెలకొన్నది.దీంతో గ్రామాలు నిధుల్లేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం లేదు. ప్రత్యేక అధికారులు అప్పుడప్పుడు వచ్చి పోతున్నారు.

-బుట్టి చంటి..